శిలాఫలకానికే పరిమితం

- పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు
- వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు


శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కేవలం శిలాఫలకాలు, కాగితాలకే పరిమితమైందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఎట్టకేలకు నాటి సీఎం కేసీఆర్‌తో కొట్లాడి రూ.15కోట్లు నిధులు మంజూరు చేయించి నాటి జిల్లా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌లచేత గార్లలో బ్రిడ్జి నిర్మాణంకు అట్టాసంగా శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పాకాల ఏటి బ్రిడ్జి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తయారైంది. దీంతో ప్రతీఏటా వర్షాకాలంలో పాకాల ఏరు 3నెలల పాటు చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తుండటంతో రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలు, పాఠశాల విద్యార్థులు మండల కేంద్రమైన గార్లకు రాలేక బయ్యారం, డోర్నకల్ మండలాల మీదుగా చుట్టూ తిరిగి వస్తూ నానా ఇబ్బందులు పడుతుంటారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య గత ప్రభుత్వంలో మంజూరైన రూ.15 కోట్ల నిధుల విషయంపై సంబంధిత రాష్ట్ర మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


పొంగి ప్రవహిస్తున్న పాకాల వాగు (ఫైల్)


రైల్వేట్రాక్ బ్రిడ్జి పైనుంచి గార్లకు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

సమాజంలో రచయితల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: సమాజంలో కవులు, రచయితల పాత్ర కీలకమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సామాజిక, సాహిత్య విశ్లేషకులు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచించిన శంఖారావం పుస్తకంను ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచనలు సమాజానికి ఎంతో మేలు కలిగేలా ఉన్నాయన్నారు. కవులు రచయితలు చేసే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కవులకు రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారధిరెడ్డి, బి.కృష్ణ, శర్మ, శ్రీనివాస్, సోమేశ్వరచారి, కీర్తనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


కురవి: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్


చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

దంతాలపల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. మండంలోని బొడ్లాడ గ్రామంలోని నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యాక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగూడూరు: సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు, అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తొర్రూర్ ఆర్డీఓ గణేష్ సూచించారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును ఆయన పర్యవేక్షించి పలు సూచనలు, సలహాలు చేశారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, తదితరులు ఉన్నారు.

కురవి: మండల కేంద్రం శివారు తులిస్యా తండా గ్రామంలో ఆదివారం సర్వేను తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు పరిశీలించారు.

తొర్రూరు రూరల్: మండలంలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ నర్సింగరావు, తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ అలసత్వం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన 15రోజుల్లోనే రెండు డీఏలు ప్రకటిస్తామని, ఆరునెలల్లో మెరుగైన పీఆర్సీని ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి పరిష్కరించలేదన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల, సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకుబ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హరినాయక్, ఉపాధ్యాయులు కుమార్, రాజశేఖర్, ఇమామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లారెడ్డి

జీపీ సిబ్బందికి పారితోషికం ఇవ్వాలి

నెహ్రూసెంటర్: కుల గణనలో పాల్గొంటున్న జీపీ సిబ్బందికి తగిన పారితోషికం ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో పాల్గొంటున్న అధికారులకు ప్రత్యేక రెమ్యూనేషన్ అందిస్తున్నారని, గ్రామాల్లో సర్వే జరిగేలా సహకరిస్తున్న జీపీ సిబ్బందికి పారితోషికందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అసలే అరకొర వేతనాలు, అవి అందక నెలల తరబడి ఎదురు చూస్తున్న కార్మికులకు సర్వేభారం మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలని, సర్వేలో పాల్గొంటున్న జీపీ కార్మికులకు రెమ్యూనేషన్ ఇవ్వాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ సహకరించాలని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ దేవేందర్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ కూడా తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

మానుకోట అభివృద్ధికి సహకరించాలి


రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతున్న మానుకోట మున్సిపాలిటీ వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. నిలిచిపోయిన వార్డుల అభివృద్ధిపై సీపీఐ ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం పలు వార్డుల్లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి ప్రభుత్వ హయంలో మానుకోట అభివృద్ధికి నిధులు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని జిల్లాకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, రమేష్, చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీగా మారడంతో ఇబ్బందులు


మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

డోర్నకల్: డోర్నకల్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. డోర్నకల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డోర్నకల్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో ఉపాధి పథకం రద్దై కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంటి పన్నులు పెరగడం, ఇంటి నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు, స్థలాల ధరలు పెరగడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, అభివృద్ధి పనులు నిలిచాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డోర్నకల్‌ను మేజర్ గ్రామపంచాయతీగా మార్చాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రమేశ్, నాయకులు ప్రభేష్, స్వామి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

మరిపెడ/మరిపెడ రూరల్: ప్రతీ ఒక్కరు భక్తి భవాన్ని పెంపొందించుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. అదివారం మరిపెడ మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి సహిత హరిపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప మాల ధారులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యుగేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. నేటి నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు గోలి శ్రీనివాస్, సభ్యులు దుబ్బాక లక్ష్మారెడ్డి, అల్వాల ఉపేందర్, పల్లం వీరస్వామి, డి.వెంకన్న, చెన్నూరు మహేష్, రమేశ్ పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న యుగేందర్‌రెడ్డి

ఉత్సవాలను గ్రామగ్రామాన నిర్వహించాలి


మాట్లాడుతున్న విజయ్‌సారథి

బయ్యారం: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను గ్రామగ్రామాన నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పేద ప్రజల పక్షాన సీపీఐ పార్టీ అనేక పోరాటాలు నిర్వహించి పలు విజయాలను సాధించిందన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, నాయకులు కళింగ రెడ్డి, రాజు, శ్రీను, బిచ్చ, వీరన్న లక్ష్మి పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భార్య ఆందోళన

గార్ల: తన భర్త వద్దకు కాపురానికి పంపించి న్యాయం చేయాలని కోరుతూ ఓ యువతి ఆదివారం గార్ల నెహ్రూసెంటర్‌లో రోడ్డుపై బైటాయించి మౌనపోరాటం చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి, గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన బి.సంగీత అదే గ్రామానికి చెందిన ఎస్.శ్రీకాంత్‌లు రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏడాది వీరి కాపురం సజావుగానే సాగింది. కొద్ది రోజుల నుంచి శ్రీకాంత్ తన తల్లితండ్రుల మాటలు విని భార్యతో గొడవపడి పుట్టింటికి పంపించాడు. తన భర్త వద్దకు కాపురానికి పంపించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సంగీత తెలిపింది. న్యాయం చేయాలని కోరుతూ గార్లలో రోడ్డుపై బైటాయించింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి ఎస్సై జీనత్‌కుమార్ చేరుకొని న్యాయం చేస్తామని చెప్పడంతో యువతి ఆందోళన విరమించింది. ఇట్టి విషయమై ఎస్సై వివరణ కోరగా సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలతోపాటు భర్త అన్నయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.


రోడ్డుపై ఆందోళన చేస్తున్న సంగీత

ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండా జీపీ పరిధిలోని బాలు తండాలో బాధిత కుటుంబానికి విజయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాలోత్ రామారావు రూ.10వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశాడు. బాలు తండాలో ఇటీవల భూక్య రాంసింగ్ అనే వ్యక్తి మృతి చెందాడు. పేదరికంలో ఉన్న కుటుంబానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయం అందజేసినట్లు రామారావు తెలిపారు. పేదవారికి సాయం అందించడంలో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాలోత్ వీరన్న, మంగీలాల్, భూక్య జామ్లా, భద్రునాయక్, దేవిలాల్, లింగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అమరవీరుల ఆశయసాధనకు పోరాడుదాం

గూడూరు: భూమికోసం భుక్తికోసం పోరాడి అమరులైన పోరాటయోధుల ఆశయాల కోసం పోరాడదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా మండల నాయకుడు ఈరెడ్డి మల్లేశం అన్నారు. మండలంలోని సీతానాగారం గ్రామంలో అమరవీరుల ఆశయ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భద్రక్క, వీరమల్లు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పెద్దవంగర: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన చిలుక టైటస్ (40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మండల ఇన్‌చార్జ్‌గా ఉపేందర్



కురవి: మండలంలోని బలపాల గ్రామానికి చెందిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మండల ఇన్‌చార్జ్‌గా ఎల్లావుల ఉపేందర్‌ను ఫోరం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు డి.కుమారస్వామి ఎంపిక చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలయానికి మరమ్మతులు

కురవి: రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కందికొండ గ్రామ శివారు కందగిరి పర్వతంపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పాక్షికంగా కూలిపోయింది. ఈమేరకు లక్ష్మీనర్సింహస్వామి జాతర సమీపిస్తుండడంతో గ్రామానికి చెందిన భక్తుడు జంగాల భాస్కర్ కుటుంబ సభ్యులు పాక్షికంగా కూలిపోయిన ఆలయానికి మరమ్మతులను చేయించారు. మరో రెండు రోజుల్లో ఆలయానికి పూర్తిగా మరమ్మతులు చేస్తామని భాస్కర్ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

డోర్నకల్: మతతత్వ, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హాలావత్ లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో ఆదివారం నిర్వహించిన అమరవీరుల సంస్మరణ వారోత్సవ సభలో నున్నా పుల్లయ్య, ప్రతాపరెడ్డి స్మారక స్థూపాల వద్ద పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జడ సత్యనారాయణ, గండు నాగన్న, యాసా వెంకటనారాయణ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో శ్రమదానం

కురవి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉడ్చారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, ఏఎస్సైలు వెంకన్న, సదయ్య, జమేదార్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్వీట్స్ అండ్ బేకరీ అసోసియేషన్ ఎన్నిక



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని స్వీట్స్ అండ్ బేకరీ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు మార్వాడీ సత్రంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, ఉపాధ్యక్షులుగా సలీం, ప్రధాన కార్యదర్శిగా శ్రీను (చిన్న), కోశాధికారిగా రాంపాల్‌ను ఎన్నుకున్నారు.

దాడి ఘటనపై విచారణ

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన దాడిపై ఆదివారం డోర్నకల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఉయ్యాలవాడ గ్రామంలో శనివారం జరిగిన వివాహ వేడుకకు కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన కొంతమంది హాజరయ్యారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు గొడవ పడి దాడి చేసుకోగా కృష్ణమూర్తి అనే వ్యక్తి తలకు గాయాలయ్యాయి. దీనిపై ఆదివారం పోలీసులు విచారణ చేపట్టారు. దాడిపై తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల ముస్లిం కమ్యూనిటీ హాల్ (షాదీఖానా) నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా కేసముద్రంస్టేషన్‌కి చెందిన షేక్ మహమ్మద్ అలీ ఎన్నికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులుగా యాకుబ్‌పాషా, షేక్ జానీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ జావెద్, కార్యదర్శి అల్లావుద్దీన్, సహాయ కార్యదర్శి మహమ్మద్ తాజుద్దీన్, కోశాధికారి అక్బర్, గౌరవ సలహాదారులుగా జలాల్ షరీఫ్, అమీరుద్దీన్, ఖాదర్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన వాస్తునిపుణులు, ప్రముఖ వ్యాపారవేత్త బోనగిరి గంగాధర్ నాద్ మాతృమూర్తి సీతారత్నం అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ 15వ వార్డు పరిధిలోని బీటీఆర్ నగర్ కాలనీకి చెందిన సంపంగి రామచంద్రు తల్లి నర్సమ్మ మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు

కొత్తగూడ: అడవి పంది దాడిలో మహిళకు గాయాలు అయిన సంఘటన మండలంలోని బత్తులపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన గాదర్ల సమ్మక్క బత్తులపల్లిలోని బంధువుల మక్కజొన్న చేను విరిచేందుకు వచ్చింది. కంకులు విరుస్తుండగా చేనులో మకాం వేసుకుని ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేసింది. ఈ ఘటనలో సమ్మక్కకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై హర్షం

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ చొరవతో అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని గ్రామ రైతులు పట్నంశెట్టి నాగరాజు, బైస ఉప్పలయ్య అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మునిగలవీడు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఒకటే కొనుగోలు కేంద్రంతో రైతులు వరి ధాన్యం విక్రయించడానికి తీవ్ర ఇబ్బందులు పడే వారమని అన్నారు. ఎక్కువ వరిధాన్యం సాగయ్యే మునిగలవీడు గ్రామానికి అదనంగా ఐకేపీ ఆధ్వర్యంలో సిరివెన్నెల గ్రామైక్య సంఘానికి కొనుగోలు కేంద్రం అనుమతి ఇవ్వడంపై ఎమ్మెల్యేకు రైతులంతా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్ల కవిత, ఉప్పలయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గూడూరు: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 2000–21 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

క్లుప్తంగా

సరుకుల పంపిణీ



నెహ్రూసెంటర్: గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కాలనీలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య బాలునాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో వేణు, గోపాల్, విష్ణు, సురేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును ప్రారంభించాలి

కొత్తగూడ: కొత్తగూడ మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకుడు ప్రభాకరన్న డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, గంగారం మండలాల రైతులు పండించిన పంటను విక్రయించుకోవడానికి మార్కెట్ యార్డు లేక నర్సంపేట, వరంగల్ పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ల్యాదల్ల రాజు, పాపయ్య, సమ్మయ్య, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా రవినాయక్



నెహ్రూసెంటర్: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మహబూబాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మూడ్ రవినాయక్ ఎన్నికయ్యాడు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశాడు.

మట్టి తరలింపును అడ్డుకోవాలి

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామ మల్లన్న గుట్ట ప్రభుత్వ స్థలం నుంచి కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలించడాన్ని అడ్డుకోవాలని గ్రామ యాదవులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా జేసీబీ సహాయంతో మట్టి తరలించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మట్టి తరలించడం ద్వారా గొర్రెలు, మేకల మేతకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకుని వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

డోర్నకల్: డోర్నకల్‌లో ఈనెల 16, 17వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బీఆర్ వీరస్వామి, జిల్లా నాయకులు శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్‌కుమార్, యు.శ్రీనివాస్, నవాబ్, మల్లేశం, బొబ్బ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

మరిపెడ రూరల్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు జర్పుల విజయ అన్నారు. ఆదివారం బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన సర్వే అధికారులకు విజయ్ పూర్తి సహకారం అందించాడు. కార్యక్రమంలో సర్వే అధికారులు మరిపెడ ఆర్ఐ శరత్‌చంద్ర, గుగులోతు పాపాలాల్, వీఆర్ఐ వినయ్, పాల్గొన్నారు.

గిరిపుత్రులకు స్క్రీనింగ్ టెస్ట్

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఎంపికకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు గిరిజన విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఈర్పా సారయ్య దొర హాజరై మాట్లాడుతూ.. ఈ టెస్టుకు మానుకోట జిల్లా మొత్తం 84 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని, ఉచిత ఉద్యోగ శిక్షణ స్క్రీనింగ్ టెస్టుకు 54మంది హాజరయ్యారన్నారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించామని, ఇందులో ఎంపికైన విద్యార్థులకు మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అనంతరం ఎంపికైన వారికి హన్మకొండలో 3నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు.